సాక్షి శ్రీకాకుళం
శుక్రవారం । 24 । నవంబర్ । 2023



అప్రెంటిస్‌తో కొలువు సులువు

ఐటీఐ విద్యార్థులు అప్రెంటిస్‌పై ఆసక్తి చూపుతున్నారు. నైపుణ్యం పెంచుకుంటున్నారు. - 8లో



రోడ్డు ప్రమాదంలో..

రోడ్డు ప్రమాదంలో కాంపౌండర్ దుర్మరణం చెందారు. కోసంగిపురం కూడలి వద్ద ప్రమాదం జరిగింది. - 8లో

విభిన్న ప్రతిభావంతులకు జిల్లా స్థాయి ఆటల పోటీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 3న శ్రీకాకుళం/పార్వతీపురం మన్యం జిల్లాలో గల విభిన్న ప్రతిభావంతులకు కేటగిరీల వారీగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంస్థ ఏడీ కె.కవిత తెలిపారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా స్థాయిలో 26వ తేదీ నుంచి పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

డిసెంబర్ 3న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ ఉపకార వేతన పరీక్ష(ఎన్‌ఎంఎంఎస్) డిసెంబర్ 3న జరగనుందని, అభ్యర్థులంతా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారిక వెబ్‌పోర్టల్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవి.ఇన్ లో లాగిన్ అయి హాల్‌టిక్కెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఈ విషయమై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. పాఠశాల యు–డైస్ కోడ్‌ను ఉపయోగించి, పరీక్షలకు హాజరయ్యే పాఠశాల విద్యార్థుల హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసి అందజేయాలని సూచించారు. వారంతా శత శాతం పరీక్షలకు హాజరయ్యేలా శ్రద్ధ తీసుకోవాలని డీఈఓ విజ్ఞప్తి చేశారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి ఉత్సవం



చక్కగా అలంకరించిన పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులు

జలుమూరు: కార్తీక మాసం బహుళ ఏకాదశి సందర్భంగా శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుని తిరువీధి ఉత్సవం గురువారం ఘనంగా జరిగింది. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ తిరువీధి నిర్వహించగా భక్తులు హారతులిచ్చారు.

డిసెంబర్ 30 నాటికి భవనం పూర్తి చేయాలి



పనులు జరుగుతున్న పరిపాలన భవనం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో రూ. 35 కోట్లతో నిర్మిస్తున్న పరిపాలన భవనం డిసెంబర్ 30 నాటికి పూర్తిచేయాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు స్పష్టం చేశారు. భవన నిర్మాణంపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. భవనం సకాలంలో పూర్తిచేయని రాజేష్ మహంతి కాంట్రాక్టు సంస్థను నిబంధనల మేరకు రద్దు చేశారు. ఈ మేరకు రూ. 25 కోట్ల బిల్లులు చెల్లించారు. ఆన్‌లైన్ టెండర్ ద్వారా రూ. 15 కోట్లతో పనుల నిర్వహణను విశాఖపట్నకు చెందిన గ్లోబ్ కన్‌స్ట్రక్షన్ సంస్థకు అప్పగించారు. ప్రస్తుతం ఈ సంస్థ పనులు ప్రారంభించింది. రూ. 10 కోట్లతో నిర్మించిన వసతి గృహం భవనం త్వరలో ప్రారంభించనున్నట్లు వీసీ చెప్పారు. ఈ సమీక్షలో కేంద్ర ప్రజా పనులు విభాగం ఈఈ శ్రీనివాసులు, వర్సిటీ ఇంజినీర్ కె.అంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు సాందీప్ శర్మ


అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా గురువారం ఉదయం ఘనంగా జరిగింది. శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీ వారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా కల్యాణ మూర్తులుగా అలంకరించి అనివేటి మండపంలో వేంచేసింప జేశారు. అనంతరం ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం కల్యాణ సేవకు హాజరైన భక్త దంపతులకు శేష వస్త్రాలతో పాటు తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు నెమలిపురి కోటేశ్వర చౌదరి, లుకలాపు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

భూతగాదాలకు స్వస్తి!



టెక్కలి మండలం కె.కొత్తూరులో ఓ గ్రామకంఠంలో ఉన్న ఇళ్ల మ్యాప్‌ను చూపిస్తున్న అధికార బృందం

- గ్రామ కంఠాల్లో నిర్మాణాలకు ఇక శాశ్వత హక్కు
- జిల్లాలో స్వామిత్వ పథకం ద్వారా గ్రామాల్లో సర్వే
- ఇప్పటివరకు 1190 గ్రామాల్లో డ్రోన్ ఫ్లై పూర్తి
- 629 గ్రామాల్లో 1.48 లక్షల గ్రామకంఠ ఆస్తుల గుర్తింపు



అరసవల్లి: గ్రామ కంఠంలోని భూములకు, అందులో నిర్మించుకున్న ఇళ్లకు రక్షణ కల్పిస్తూ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. వినూత్న భూ సంస్కరణలు తీసుకొచ్చి లక్షలాది మందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత భూరక్ష, భూహక్కును కల్పించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ కంఠం భూముల క్రమబద్ధీకరణ, అనుభవ యజమానులకు ఆస్తి హక్కు ధ్రువీకరణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేసింది. ఇందుకోసం జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం కింద విలేజి అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రోవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజి ఏరియాస్ (స్వామిత్వ) కార్యక్రమం ద్వారా 2020 నుంచే గ్రామాల్లో డ్రోన్ల ద్వారా సర్వే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీంతో గ్రామ కంఠాల్లో నివాసాలు కట్టుకున్నవారు, అలాగే ఖాళీ స్థలాలను వినియోగించుకునే వారిని గుర్తించి వారికి ఆ ఆస్తిపై శాశ్వత హక్కులను కల్పించే దిశగా చర్యలు తీసుకుంది. దీంతో జిల్లాలోని 30 మండలాల్లో సుమారు లక్ష మంది వరకు ఈ పథకం ద్వారా శాశ్వత లబ్ధి పొందనున్నారు. రూ.లక్షలాది విలువైన స్థలాలకు శాశ్వత యజమానులుగా మారనున్నారు.

1.48 లక్షల గ్రామ కంఠ స్థలాల గుర్తింపు

జిల్లాలో మొత్తం 30 మండలాల్లో 912 గ్రామ పంచాయతీలు ఉండగా, 835 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిలో భాగంగా మొత్తం 1466 రెవెన్యూ గ్రామాలుండగా 1190 గ్రామాల్లో గ్రామ కంఠాలు, ఇతర ప్రభుత్వ భూములకై సర్వే కోసం డ్రోన్ ఫ్లై ప్రక్రియను పూర్తి చేశారు. మండల పరిధిలో తహసీల్దార్, ఈఓపీఆర్డీ, డీటీ రీసర్వే, మండల సర్వేయర్ బృందం ఈ సర్వేలో పర్యవేక్షక బాధ్యతలు చేపడుతుండగా, స్థానిక సచివాలయ పరిధిలో పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో, ఇంజినీరింగ్ అసిస్టెంట్, విలేజి సర్వేయర్, డిజిటల్ అసిస్టెంట్ బృందం సర్వేను క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా నిర్వహిస్తోంది. ఇంతవరకు ఈ సర్వే పూర్తయిన 629 గ్రామాల్లో గ్రామ కంఠం పరిధిలో నిర్మించిన ఇళ్లు ఇతర ప్రాపర్టీలుగా 1,48,808 ఆస్తులున్నట్లుగా గుర్తించారు. వీటిని సర్వే చేస్తున్న క్రమంలో ఇంతవరకు 130 గ్రామాల్లో 34,156 ఆస్తులకు ప్రాపర్టీ పార్సిల్ మ్యాప్ (పీపీఎం) జారీ చేసేలా సన్నద్ధమవుతున్నారు.

అయితే ఇప్పటివరకు 145 గ్రామాల్లో ఇంటింటి సర్వే పూర్తి చేసినప్పటికీ 130 గ్రామాల్లోనే ఏపీ సర్వే చట్టం 13వ సెక్షన్ ప్రకారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మేరకు మొత్తం 66 గ్రామాల్లో 14,778 మందికి ప్రాపర్టీ కార్డులు జారీకి సిద్ధం చేశారు. కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కొద్ది రోజుల్లోనే ప్రారంభించనున్నారని జిల్లా అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు ఇదే వేదికగా జిల్లాలో మొత్తం 14,778 మందికి ఆయా స్థలాలకు శాశ్వత యజమానులుగా ప్రోపర్టీ కార్డులు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సర్వే పూర్తయ్యేలా చర్యలు



జిల్లాలో స్వామిత్వ సర్వేను ఇంకా వేగంగా జరిపించేలా చర్యలు చేపడుతున్నాం. ఇందులో నిర్లక్ష్యం వహించిన 156 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులను కూడా కొద్ది నెలల కిందటే జారీ చేశాం. అలాగే ప్రతి శనివారం శ్రీకాకుళం, టెక్కలి డివిజినల్ పంచాయతీ అధికారులతో పాటు, ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో ఈ సర్వేపై టెలీ కాన్ఫరెన్స్‌ను నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు 14,778 మందికి ప్రాపర్టీ కార్డులను జారీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

– వి.రవికుమార్, జిల్లా పంచాయతీ అధికారి

565 మందికి రూ.3.32 కోట్లు



లబ్ధిదారులకు మోడల్ చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

- వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా సాయం విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా ఆర్థిక సాయాన్ని గురువారం విడుదల చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో బీసీ–ఎలో 183 మందికి రూ.93.25 లక్షలు, బీసీ–బిలో 70 మందికి రూ.35 లక్షలు, బీసీ–డిలో 231 మందికి రూ.1.19 కోట్లు, 67 మంది ఎస్సీలకు రూ.69.40 లక్షలు, 14 మంది ఎస్టీలకు రూ.15.20 లక్షలు లబ్ధి కలుగుతుందన్నారు. నిరుపేద తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించి వారి వివాహాన్ని గౌరవ ప్రదంగా జరిపించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ సాయం అందజేస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులకు వేడుక భారం కాకుండా ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుందని, నూతన వధూవరులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం లబ్ధిదారులకు ఆయన నమూనా చెక్కును అందజేశారు.

కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, కళింగ కార్పొరేషన్ అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు వై.విశ్వమోహన్ రెడ్డి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి అనూరాధ, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రుణపడి ఉంటాం..



శ్రీకాకుళం మండలానికి చెందిన గొంటి భారతికి పాత శ్రీకాకుళంలోని గురుబిల్లి సంతోష్ కుమార్‌తో వివాహం జరిగింది. వీరు షెడ్యూలు కులాల తెగలకు చెందిన వారు. భారతి ఇంటర్ పాసై ల్యాబ్ టెక్నీషియన్‌గా శిక్షణ తీసుకున్నారు. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నారు. సంతోష్ డిగ్రీ పూర్తి చేసి ఫొటో స్టూడియో నడిపిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సాయం కుటుంబానికి ఉపయోగపడుతుందని చెబుతున్నారు. సీఎంకు రుణపడి ఉంటామని అన్నారు.

అప్పులు తీరుతున్నాయి



శ్రీకాకుళం మండలం బైరి గ్రామానికి చెందిన నాయిని ఉమ డిగ్రీ మూడో సంవత్సరం చదువుతోంది. ఈమెకు తంగివానిపేటకు చెందిన శిమ్మ గోపీతో వివాహమైంది. అతను బీటెక్ కంప్యూటర్స్ చదివాడు. సీఎం అందించిన సాయంతో వివాహ ఖర్చుల కోసం చేసిన అప్పులు తీర్చగలుగుతామని ఆమె చెబుతున్నారు. ఈ పథకం తమ కుటుంబానికి ఎంతో సాయపడిందని అంటున్నారు. ముఖ్యమంత్రి మేలు మర్చిపోలేమని తెలిపారు.

ఆదిత్యుని తెప్పోత్సవం నేడు



పుష్కరిణిలో హంసవాహనంతో ట్రయల్ రన్

- ట్రయల్ రన్ విజయవంతం
- హంస వాహనంలోకి వైదిక సిబ్బందికే అనుమతి
- స్పష్టం చేసిన ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్

అరసవల్లి: ఆదిత్యుని తెప్పోత్సవానికి వేళయ్యింది. క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా శుక్రవారం అంగరంగ వైభవంగా ఉత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవానికి వినియోగించనున్న హంస వాహనం పూర్తి ఫిట్‌నెస్‌తో ఉందని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రకటించారు. గురువారం సాయంత్రం స్థానిక ఇంద్రపుష్కరిణిలో ట్రయల్ రన్ నిర్వహించారు. స్థానిక పోలీస్, ఫైర్, మత్స్యశాఖ సిబ్బందితో కలిసి ఆయన హంసవాహనంలో ఎక్కారు. మూడు సార్లు పుష్కరిణి చుట్టూ వాహనాన్ని తిప్పి ఫిట్‌నెస్‌ను అధికారుల బృందం పరిశీలించి సంతృప్తిని వ్యక్తపరిచారు. అనంతరం ఈఓ హరిసూర్యప్రకాష్ విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి స్వామి వారి జలవిహారయాత్ర ప్రారంభం కానుందని, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అటు పుష్కరిణి వద్ద, ఇటు ఆలయంలోపల కూడా తగిన ఏర్పాట్లు చేశామని, పుష్కరిణి చుట్టూ విద్యుత్ అలంకరణ చేయిస్తున్నట్లుగా వివరించారు. ఇక హంసవాహనంలోకి వైదిక సిబ్బందిని మాత్రమే అనుమతించనున్నామని, అలాగే వాహనంలోకి ఎక్కిన వారికి మత్స్యశాఖాధికారుల సూచనల మేరకు భీమా కల్పిస్తున్నామన్నారు. అలాగే ఆలయంలో శుక్రవారం (నేడు) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆదిత్యుని మూలవిరాట్టు పూర్తిగా స్వర్ణాలంకరణలో దర్శనమివ్వనున్నట్లుగా తెలియజేశారు. భక్తుల సెల్‌ఫోన్లు, కెమెరాలకు ఆలయం లోపలికి అనుమతి లేదని స్పష్టం చేశారు.

పసి హృదయం.. కోరుతోంది సాయం



గుండెలో రంధ్రంతో పుట్టిన చిన్నారి లినీషా

కంచిలి: అభంశుభం తెలియని ఆ పసికందు ప్రాణాల కోసం పోరాడుతోంది. పుట్టుకతోనే గుండెలో రంధ్రం ఏర్పడటంతో ప్రాణాయస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. కంచిలి మండలంలోని జాడుపూడి పంచాయతీ పరిధి బసదపుట్టుగ గ్రామానికి చెందిన బొరియాశెట్టి శంకరరావు, శైలజ దంపతులకు పుట్టిన కుమార్తెకు పుట్టుకతోనే గుండెలో రంధ్రం ఏర్పడింది. కేవలం యాభై రోజుల వయసు గల ఈ పసికందు ప్రస్తుతం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇప్పటివరకు రూ.6 లక్షలు ఖర్చయ్యిందని, ఓపెన్ హార్ట్ సర్జరీ చేస్తే గానీ బిడ్డ ప్రాణం దక్కదని వైద్యులు చెబుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారని, దాతలే తమ బిడ్డను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. సాయం చేయాలనుకునే వారు 8125971417 నంబర్‌ను సంప్రదించాలని విన్నవించారు.

‘ధాన్యం విక్రయాలు అధికారుల బాధ్యత’

జలుమూరు: ధాన్యం విక్రయాలకు మిల్లర్లతో ప్రమేయం లేకుండా చూసే బాధ్యత అధికారులదేనని రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ హనుమంతు అరుణ్‌కుమార్ అన్నారు. ఆయన గురువారం కరవంజ రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలుపై అధికారులకు పలు సూచనలు చేశారు. కొందరు రైతులు తమ ధాన్యంను మిల్లర్లు దించడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు అనుసరించి జీపీఎస్ అమర్చిన వాహనం ద్వారా కేటాయించిన మిల్లుకు ధాన్యం చేరవేయాలన్నారు. రైతు పంపిన ధాన్యం ట్రక్ షీట్ జనరేట్ అయితే రైతు మిల్లుకు వెళ్లనవసరం లేదని చెప్పారు. అయితే రైతులు రవాణా చేసే వాహనం జీపీఎస్ చేసే బాధ్యత అధికారులే చూసుకోవాలని సూచించారు. అలాగే రైతులకు గోనె సంచులు, రవాణ, కూలీల ఖర్చులు కూడా రైతుల ఖాతాకు జమవుతాయన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నాణ్యత చూసే యంత్రాలు తప్పనిసరిగా ఉంచాలని చెప్పారు. అలాగే తేమ శాతం లేకుండా చూసుకోవాలన్నారు. ఆయనతో పాటు జేసీ ఎం.నవీన్, డీఎస్‌ఓ డి.రమణ, పౌరసరఫరాల డీఎం కె.శ్రీనివాసరావు, జేడీ శ్రీధర్, తహసీల్దార్ బి.సత్యం, ఏఓ సురేష్ కుమార్, సీఎస్‌డీటీ డి.గణేష్ తదితరులు ఉన్నారు.



కరవంజలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ్ కుమార్

అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్‌కు ఇద్దరు ఎంపిక

ఇచ్ఛాపురం: విశాఖపట్టణంలోని పోర్టు స్టేడియంలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న అంతర్జాతీయ వాడో కాయ్ కరాటే ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పురుషోత్తపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వై.లత తెలిపారు. జూన్‌లో జరిగిన జాతీయ కరాటే పోటీల్లో టి.సాయిప్రియ, డి.పూజలు బంగారు పతకాలు సాధించి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ మేరకు పురుషోత్తపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం అభినందించారు. కార్యక్రమంలో కరాటే కోచ్ ప్రకాష్, ఉపాధ్యాయులు రాజగోపాల్, రాంప్రసాద్, తేజేశ్వరరావు, జయలక్ష్మి, సత్యవాణి, ఆదిలక్ష్మి, పిఈటి సూర్య, సిఆర్‌పి మోహన్, దర్మారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం లత, సిబ్బంది

సంక్షేమ పథం



మాకు ధైర్యమిచ్చారు



ఇల్లు లేని మాలాంటి వారిని గుర్తించి జగనన్న లేఅవుట్‌తో పాటు పక్కాగా గృహం మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం. సొంత ఇల్లు లేకపోవడంతో అద్దె ఇళ్లలోనే బతుకులీడుస్తున్నాం. అప్పటికప్పుడు ఖాళీ చేయాల్సిన పరిస్థితి వస్తే సామాన్లు తీసుకుని వెళ్లేందుకు చాలా ఇబ్బందులు ఎదుర్కొనే సమస్య వచ్చేది. కూలి పనులు చేసుకుని అద్దె ఇంట్లో ఉంటే కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉండేది. జగనన్న పాలనలో ఇప్పుడు పక్కా ఇల్లు మంజూరు కావడంతో ధైర్యంగా మా ఇంటిలో ఉంటున్నాం. సీఎం వైఎస్ జగన్ వల్లే ఆ ధైర్యం వచ్చింది. పక్కా గృహం సకాలంలో నిర్మించి గృహ ప్రవేశం చేసి కుటుంబం అంతా సంతోషంగా ఉంటున్నాం.

– కూన విజయకుమారి, ఇసుకలపేట గ్రామం, ఆమదాలవలస మండలం

ఒక్క రోజులోనే కుల ధ్రువీకరణ పత్రం



ఈ ఏడాది వైఎస్సార్ చేయూత పథకానికి అర్హత పొందుతున్నందున కుల ధ్రువీకరణ పత్రం అవసరం పడింది. జగనన్న సురక్ష కార్యక్రమంలో మా ఇంటికి వచ్చిన వలంటీర్‌కు విషయం చెప్పి దరఖాస్తు చేయించాను. ఒకే ఒక్క రోజులో ధ్రువీకరణ పత్రం సురక్ష క్యాంపులో నాకు అందజేశారు. ఎలాంటి రుసుం వసూలు చేయలేదు. గతంలో కుల ధ్రువీకరణ పత్రం పొందాలంటే మండల కేంద్రం చుట్టూ నెలల తరబడి తిరిగితే వచ్చేది. ఒక్క రోజులోనే చేతికి ధ్రువీకరణ పత్రం రావడం ఈ ప్రభుత్వం గొప్పదనం.

– గురుగుబెల్లి గోవిందమ్మ, తొగరాం గ్రామం, ఆమదాలవలస మండలం

అంతేనా వీరు.. మారదా తీరు

వైజాగ్‌లో ఇటీవల జరిగిన ఆటో ప్రమాదం అందరినీ ఉలికిపాటుకు గురి చేసింది. విద్యార్థులతో వెళ్తున్న ఆటో లారీని ఢీకొట్టిన ఘటనలో అదృష్టవశాత్తు అంతా ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన చూసైనా అప్రమత్తమవ్వాల్సిన ఆటోవాలాలు తమ తీరు మార్చుకోవడం లేదు. ప్రభుత్వం నిబంధనలు పెడుతున్నా, పోలీసులు హెచ్చరిస్తున్నా మళ్లీ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ప్రమాదకర ఫీట్లు చేస్తున్నారు. శ్రీకాకుళం చుట్టుపక్కల కనిపించిన దృశ్యాలివి.

– శ్రీకాకుళం క్రైమ్





పెద్దపాడు హైవేపై ఆటోలో విద్యార్థినులు ఇలా..



ఆటో ఫుల్ అయినా.. ఇంకా విద్యార్థులను ఎక్కిస్తున్న వైనం



నగరంలో చిన్నారులు వెళ్తున్నారిలా..

క్లుప్తంగా

ఎండల మల్లన్న స్థల పురాణంపై పాట విడుదల



పాటను విడుదల చేస్తున్న దేవస్థానం అధికారులు, పంచాయతీ పెద్దలు

టెక్కలి: టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జున దేవస్థానం స్థల పురాణంపై పట్టణానికి చెందిన ఎస్‌వీఎం ఆర్ట్స్ ఆధ్వర్యంలో చిత్రీకరించిన పాటను గురువారం ఆలయ సన్నిధిలో విడుదల చేశారు. ఆలయ అర్చకుడు టి.యుగంధర్ నేతృత్వంలో ఎస్‌వీఎం ఆర్ట్స్ యూట్యూబ్ చానల్ ద్వారా చిత్రీకరించిన పాటను కార్యనిర్వాహణాధికారి ప్రసాద్‌బాబు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సుధాకర్, సర్పంచ్ సర్లాన బాలకృష్ణ తదితరులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సహ నిర్మాత భాస్కర్ పట్నాయక్, మల్లన్న భజన మండలి సభ్యుడు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకే సిబ్బందికి వెటర్నరీ అసిస్టెంట్లుగా పదోన్నతి



వెటర్నరీ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన ఆర్‌బీకే సిబ్బంది

కోటబొమ్మాళి: జిల్లాలోని పలు రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న 16 మందికి వెటర్నరీ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ ఆ శాఖ జేడీ ఎం.కిశోర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కె.ముకుందరావు(కురుడు), బి.శ్రావణి(కళింగపట్నం), పి.హనీషా(మామిడిపల్లి), బాడాన శ్రవంతి(కొల్లిపాడు), పి.నాగమణి (సంకిలి), బి.హేమంత(సారవకోట), ఎ.సంతోష్(టెక్కలి), ఆర్.ధనుంజయరావు(మందస), జి.రాజేశ్వరి (తుమరాడ), జి.వెంకటరమణ(లోలుగు), ఎ.శ్రీనివాసరావు(లావేరు), బి.వెంకటనరేష్(హిరమండలం), పి.శివకుమార్(వంగర), పి.ప్రసాద్(జి సిగడాం), పి.మల్లేసు(గుత్తావల్లి), కె.అప్పలనాయుడు(పోలాకి) పశు వైద్యకేంద్రాలకు నియమించారు. వీరంతా ఆయా డిప్యూటీ డైరెక్టర్ల కార్యాలయాల్లో జాయినింగ్ రిపోర్టులు అందజేసి తక్షణమే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన

శ్రీకాకుళం పాతబస్టాండ్: పారా లీగల్ వలంటీర్లు న్యాయ సేవాధికార సంస్థలకు అనుసంధానంగా పనిచేయాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆయన గురువారం పారా లీగల్ వలంటీర్ల శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి మాట్లాడారు. చట్టాలపై అవగాహన పెంచుకుని ఉచితంగా న్యాయ సేవలు అందించడానికి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా లేబర్ చట్టాలపై అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శైలేష్ కుమార్, డొమెస్టిక్ వైలెన్స్ యాక్ట్ గురించి తలే లక్ష్మణరావు, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ కోసం డాక్టర్ బి.ప్రవీణ్, డాక్టర్ అనురాధ, సెక్సువల్ హెరాస్‌మెంట్ ఎట్ వర్క్ ప్లేస్ గురించి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం.ప్రవల్లిక, అసంఘటిత కార్మికుల నల్సా స్కీమ్ గురించి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు వివరించారు.

అసోసియేషన్‌కు గుర్తింపుపై హర్షం



స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకుంటున్న ఆర్టీసీ సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సంఘానికి ప్రభుత్వం గుర్తింపును ఇచ్చింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ అసోసియేషన్ నాయకులు గురువారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నెక్ రీజియన్ రీజనల్ అధ్యక్షుడు తమ్మినేని దివాకర్, జిల్లా అధ్యక్షుడు నరేష్‌కుమార్‌లు మాట్లాడుతూ ఆర్టీసీలోని ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతీ ఆర్టీసీ ఉద్యోగి రుణపడి ఉంటారని అన్నారు. అసోసియేషన్ గుర్తింపునకు కృషి చేసిన రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్రయ్యకి, జనరల్ సెక్రెటరీ డిఎస్‌పి రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ జీఎం నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని శ్రీకాకుళం 1,2 టెక్కలి,పలాస డిపో లోని సభ్యులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

అప్రెంటిస్‌తో కొలువు సులువు



వెల్డింగ్ నేర్చుకుంటున్న విద్యార్థి

- ఉద్యోగానికి ముందే నైపుణ్యం పెంపు
- అప్రెంటిస్‌ను కీలకంగా భావిస్తున్న ఐటీఐ విద్యార్థులు
- పారిశ్రామిక అవసరాలు తెలుసుకుంటున్న వైనం

ఎచ్చెర్ల క్యాంపస్: ఉద్యోగానికి ముందే ఆ అంశంపై పట్టు సంపాదించడం, పరిశ్రమల్లో పనులపై అవగాహన పెంచుకోవడం, ఇంటర్వ్యూలను సమర్థంగా ఎదుర్కోగల నేర్పు నేర్చుకోవడం..ఏ విద్యార్థికైనా కీలకం. మరీముఖ్యంగా ఐటీఐ విద్యార్థులకు ఇవి తప్పనిసరి. అందుకే అప్రెంటిస్ పద్ధతిని ఐటీఐ విద్యార్థులు చాలా కీలకంగా భావిస్తున్నారు. అప్రెంటిస్‌షిప్ చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. కోర్సులో ఉండగానే పరిశ్రమల అవసరాలు తెలుసుకునేందుకు ఆన్ జాబ్‌వర్క్ పేరుతో కాలేజీలు పరిశ్రమల పరిశీలనకు అవకాశం కల్పిస్తాయి. అప్రెంటిస్‌షిప్ తర్వాత పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఒకవేళ అప్రెంటిస్‌షిప్ లేకుండా ఉద్యోగ అవకాశాలు ఇచ్చినా ముందుగా పరిశ్రమల్లో కొన్ని నెలల పాటు అప్రెంటిస్‌గా పనిచేయాల్సి ఉంటుంది.

కాలేజీలకు వచ్చి..

జిల్లాలో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఎక్కువ మంది ఐటీఐ విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారు. తక్కువ వయస్సులో ఉపాధి లభించటం ఇందుకు కారణం. జిల్లాలో ఎచ్చెర్ల, శ్రీకాకుళం డీఎల్‌టీసీ, పలాసల్లో మూడు ప్రభుత్వ ఇండ్రస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లు ఉండగా, 20 ప్రైవేట్ ఐటీఐలు ఉన్నాయి. ఏడాదికి మూడు వేల మంది విద్యార్థులు రిలీవ్ అవుతుండగా, 1000 మంది వరకు అప్రెంటిస్ చేస్తున్నారు. పరిశ్రమలే ఐటీఐలకు వచ్చి విద్యార్థులను అప్రెంటిస్ మేళాలు నిర్వహించి ఎంపిక చేసుకుంటున్నాయి.



కటింగ్ నేర్చుకుంటున్న విద్యార్థి

ఆర్‌టీసీ, ఇండియన్ రైల్వే వంటి ప్రభుత్వ సంస్థలు, జిల్లాలోని అరబిందో, ఆంధ్రా ఆర్గానిక్స్, స్మార్ట్ కెం, నాగార్జునా అగ్రికెం, శ్యాంక్రిగ్ పిస్టన్స్ వంటి సంస్థలతో పాటు, విశాఖపట్నం, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో పరిశ్రమలు సైతం విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్ మేళాలు నిర్వహిస్తున్నాయి. 12 నెలల పాటు అప్రెంటిస్ శిక్షణ ఉంటుంది. విద్యార్థుల క్రమశిక్షణ, నైపుణ్యం, శ్రమించే తత్వం వంటివి నచ్చితే ఉద్యోగ అవకాశాలు సైతం కల్పిస్తున్నారు. అప్రెంటిస్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ అప్రెంటిస్ ప్రమోషన్ స్కీం విద్యార్థికి అందజేసే రూ. 1500తో కలిపి రూ. 7000 నుంచి రూ. 8050 అందజేస్తున్నారు. దీంతో విద్యార్థుల ఖర్చులు ఇతర అవసరాలకు వేతనం లభిస్తుంది. కొన్ని పరిశ్రమలు భోజనం, వసతి సైతం కల్పిస్తున్నాయి. విద్యార్థులు ఐటీఐ పూర్తిచేశాక అప్రెంటిస్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలన్న ప్రభుత్వ ఆదేశాలు మేరకు సైతం అప్రెంటిస్ అనంతరం స్థానికంగా ఉద్యోగాలకు అవకాశం లభిస్తుంది. ప్రధానంగా ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, వెల్డర్, మోటార్ మెకానిక్ వంటి ట్రేడులు చదివిన విద్యార్థులకు ఈ అవకాశం ఉంది.

పారిశ్రామిక అవసరాలు కీలకం



విద్యార్థులు ఏడాది, రెండేళ్ల ట్రేడులు ఐటీఐ పూర్తి చేస్తున్నారు. ఐటీఐలో విద్యార్థులకు పారిశ్రామిక అవసరాలను అనుగుణంగా శిక్షణ ఉంటుంది. ప్రయోగాలకు ప్రాధాన్యత ఇస్తాం. మరో పక్క ఆన్ జాబ్ వర్క్‌లో భాగంగా పరిశ్రమలకు తీసుకువెళ్తాం. పూర్తిస్థాయి నైపుణ్యం రావాలంటే మాత్రం 12 నెలల అప్రెంటిస్ చేయాలి. అప్పుడే పూర్తిస్థాయి నైపుణ్యాలతో పాటు, భవిష్యత్‌లో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

– ఎల్.సుధాకరరావు, జిల్లా కన్వీనర్ పాయింట్ ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్.

కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం



క్లాస్‌వర్క్, ప్రయోగాలకు పారిశ్రామిక అవసరాలకు చాలా తేడా ఉంటుంది. పరిశ్రమల్లో టెక్నీషియన్లు, సీనియర్ల పర్యవేక్షణలో అనేక విషయాలు తెలుసుకుంటాం. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో అనేక కొత్త విషయాలు నేర్చుకుంటున్నాను. ఏడాది అప్రెంటిస్ తర్వాత పూర్తిస్థాయిలో పని నేర్చుకునే అవకాశం లభిస్తుంది.

– ఎల్.గౌరీ శంకర్, అప్రెంటిస్, స్మార్ట్ కెం టెక్నాలజీస్, పొన్నాడ.

క్షేత్రస్థాయిలో పనినేర్చుకుంటున్నా..



పూర్తిస్థాయిలో పరిశ్రమల్లో పనిచేసే నైపుణ్యం సాధించాలంటే 12 నెలలు శ్రమించాల్సి ఉంటుంది. ప్రతి విషయం నేను తెలుసుకుంటున్నాను. తెలీకపోతే సీనియర్లు చెబుతారు. ప్రారంభంలో కష్టం అనిపించింది. ప్రస్తుతం ప్రతి విషయం తెలుసుకొని ముందుకు సాగుతున్నాను.

– డి.లోకేష్, అప్రెంటిస్, స్మార్ట్ కెం టెక్నాలజీస్, పొన్నాడ

ఏడు కిలోమీటర్ల మేర..



మెట్టూరు నుంచి కొత్తూరు వరకు వందలాది బైకలతో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కొత్తూరు: పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపుమేరకు వైఎస్సార్ సీపీ శ్రేణులు కదం తొక్కాయి. మెట్టూరు నుంచి కొత్తూరు వరకు వందలాది బైక్‌లతో ఏడు కిలోమీటర్ల మేర గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కొత్తూరులో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించేందుకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి వెళ్తున్నందున.. ఆ కార్యక్రమానికి మద్దతుగా ర్యాలీ చేశారు. దారి పొడవునా వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడాయి. కార్యక్రమంలో పార్టీ నేతలు పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, పార్టీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, పడాల లక్ష్మణరావు, కుంచాల నూకరాజు, గండివలస ఆనందరావు, పంకజదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల నిర్మాణాలపై దృష్టి

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఎంపీడీఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న ఈ పనులకు ఏ మాత్రం నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే పూర్తి చేసిన పనులకు బిల్లులు త్వరగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. 20 శాతం పనులు జరిగితే పూర్తయ్యే భవనాల విషయంలో ఎలాంటి అలసత్వం పనికి రాదన్నారు. ఏజెన్సీలు, ఇంజినీరింగ్ సిబ్బందితో ప్రతి వారం ఎంపీడీఓలు సమీక్షించి నేరుగా తనకు నివేదిక పంపాలని ఆదేశించారు.

27 నుంచి కులగణన

ఈ నెల 27 నుంచి జరగనున్న కులగణన సర్వేకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, ఇప్పటికే అందరికీ శిక్షణ పూర్తయ్యిందని చెప్పారు. గ్రామాల వారీగా సర్వే సమాచారాన్ని రెండు రోజుల ముందే ప్రజలకు తెలిపేలా పత్రికా ప్రకటనలు స్థానికంగా విడుదల చేయాలని సూచించారు. గార మండలం రామచంద్రాపురం గ్రామంలో పైలెట్ సర్వే విజయవంతంగా పూర్తయిందని అన్నారు. జిల్లా కేంద్రంలో సర్వే కోసం హెల్ప్ లైన్ ఏర్పాటు చేశామని, సిబ్బంది తమ అనుమానాలు ఏవైనా ఉన్నా, క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తినా నేరుగా సంప్రదించాలని కోరారు.

ఆరోగ్యశ్రీ రిఫరెల్స్‌పై దృష్టి సారించాలి

జగనన్న ఆరోగ్య సురక్షలో 4 లక్షల మంది వైద్యులను కలిశారని, అందులో 5450 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు అవసరమని గుర్తించగా వారిలో ఇప్పటివరకు 1583 మంది మాత్రమే నెట్‌వర్క్ ఆస్పత్రులకు వెళ్లి చికిత్సలు చేయించుకున్నారని, మిగిలిన వారు ఆస్పత్రికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వీరికి ఒక్కరికి రూ.500 చొప్పున ప్రయాణ భత్యం ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ ప్రత్యేక యాప్ ప్రతి ఒక్కరూ తమ సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

ఆడదాం ఆంధ్రకు కిట్లు

సెట్ శ్రీ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రాకు కిట్లు సిద్ధంగా ఉన్నాయని, ఆదివారానికి ఆయా ఎంపీడీఓలు వీటిని మండల కేంద్రాలకు తీసుకువెళ్లే బాధ్యత తీసుకోవాలని, ఆటల పోటీలు జరిగే రోజుల్లో ఆయా సచివాలయాలకు పంపించాలని చెప్పారు. వీటి రవాణా చార్జీల కోసం మండలానికి రూ.3000 చొప్పున చెల్లిస్తామని అన్నారు. కిట్లు ఎంతో నాణ్యతగా ఉన్నాయని, మైదానాలు సిద్ధం చేయడం, రిఫరీలను గుర్తించే పని వేగంగా పూర్తి చేయాలన్నారు.

26న వికసిత భారత సంకల్ప యాత్ర

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విధానాలకు సంబంధించి పౌరులకు అవగాహన కల్పించడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ అది చేరేలా పనిచేయడం వికసిత భారత సంకల్ప యాత్ర ప్రధాన ఉద్దేశమని, ఈనెల 26 నుంచి జిల్లాలో యాత్ర ప్రారంభం కానుందని రెండు నెలల పాటు కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ చెప్పారు. కాన్ఫరెన్స్‌లో గృహ నిర్మాణ పథకం గురించి సమీక్షించారు.

నేత్రపర్వంగా కార్తీక దీపోత్సవం



కె.కొత్తూరు గ్రామంలో షిర్డీ సాయి మందిరం ఆవరణలో నేత్ర పర్వంగా కార్తీక దీపోత్సవం

టెక్కలి: కార్తీక మాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా కె.కొత్తూరు షిర్డి సాయి మందిరం ఆవరణలో గురువారం రాత్రి నేత్ర పర్వంగా కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఏలూరు శ్రీ యాజ్ఞవల్క్య రాజాశ్రమం పీఠాధిపతి కృష్ణ చరణానంద భారతి స్వామి నేతృత్వంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరై కార్తీక దీపాలను వెలిగించారు.

స్టేట్ మీట్‌కు ఏర్పాట్లు



కేశవరావుపేట ఉన్నత పాఠశాలలో బాల్ బ్యాడ్మింటన్ కోర్టులు పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట, ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం నుంచి ఈ నెల 26 వరకు నిర్వహించనున్న 67వ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏర్పాట్లను గురువారం రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పీవీ కృష్ణంరాజు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, హెచ్‌ఎం చల్లా భారతితో కూడిన అధికారులు పరిశీలించారు. పాత 13 జిల్లాల నుంచి అండర్ 14, 17, 19 (బాలురు) బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు 390 మంది వరకు హాజరు కానున్నారు. కేశవరావుపేట ఉన్నత పాఠశాలలో ఆరు కోర్టులు, ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐదు కోర్టులు ఏర్పాటు చేశారు. అండర్–14, 17 క్రీడాకారులకు కేశవరావుపేట ఉన్నత పాఠశాలలో, అండర్–19 క్రీడాకారులకు ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వసతి కల్పించారు. క్రీడల ప్రారంభోత్సవానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నారు.

విత్తన ఉత్పత్తి కీలకం



స్కై కళాశాల నర్సరీ గ్రీన్ హౌస్ పరిశీలిస్తున్న జిల్లా ఏపీ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజర్ బాలకృష్ణ

ఎచ్చెర్ల క్యాంపస్: మెరుగైన వ్యవసాయ దిగుబడులకు విత్తనం, మేలు జాతి మొక్కల ఉత్పత్తి కీలకమని జిల్లా ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజర్ పి.బాలకృష్ణ అన్నారు. సంతసీతారాంపురం గ్రామంలోని స్కై వ్యవసాయ కళాశాలలో విత్తనం, మొక్కలు ఉత్పత్తి గ్రీన్ హౌస్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఏజీ బీఎస్సీ విద్యార్థులు వ్యవసాయ లాభసాటి కోసం కృషిచేయాలని అన్నారు. తక్కువ ధరకు మంచి నాణ్యమైన విత్తనాలు అందజేయడం, రైతులకు అంటు, క్లోనింగ్ వంటి మొక్కలు అందజేసేందుకు కృషిచేయాలని సూచించారు. ఈ ప్రాంతంలో రైతులు ప్రాధాన్యత ఇస్తున్న కొబ్బరి, జీడి మామిడి, మామిడి, ఇతర ఉద్యాన వన మొక్కలు నర్సరీల్లో పెంచాలని చెప్పారు. ఏపీ సీడ్‌కార్పొరేషన్ విద్యార్థులకు తమ వంతు సహకరిస్తుందని తెలిపారు. విద్యార్థులు సేంద్రీయ పద్ధతిలో సాగు చేసిన వరి విత్తనాలకు ఆర్గానిక్ ధ్రువీకరణ అందజేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ నర్సరీలు, విత్తన ఉత్పత్తి సంస్థలు వ్యాపార ప్రయోజనాల కోసం పనిచేస్తాయని, విద్యార్థులు రైతుల ప్రయోజనాలు కోసం కృషిచేస్తున్నారని అన్నారు. వ్యవసాయ శాస్త్ర విద్యార్థులు పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కళాశాలల్లో విత్తన ఉత్పత్తి, నర్సరీల పెంపకానికి ఇస్తున్న ప్రాధాన్యతను డీన్ డాక్టర్ కె.మోషె వివరించారు.

బీసీ కులాల అభ్యున్నతికి చర్యలు



మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు

శ్రీకాకుళం న్యూకాలనీ: బీసీ కులాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. కొన్ని బీసీ కులాలను ఓబీసీలో చేర్చాలనే అంకం తుది దశకు చేరుకున్న నేపథ్యంలో శ్రీకాకుళంలోని కొన్ని బీసీ కులాల ప్రతినిధులను కలవడానికి వచ్చిన ఆయన స్థానికంగా ఓ హోటల్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎన్‌సీబీసీ రాజ్యాంగ సంస్థగా ఆవిర్భవించిన అనంతరం పార్లమెంటులో బీసీ కులాలను ఓబీసీలో చేర్చే విషయమై గత రెండేళ్లగా ఎన్నో విధాలుగా ప్రయత్నాలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. శ్రీకాకుళంతోపాటు ఉత్తరాంధ్రలోని ప్రధానంగా తూర్పుకాపు, కళింగవైశ్య, సొండి, శిష్ట కరణాలు, అరవల కులాలను బీసీల ఓబీసీలో చేర్చే ప్రక్రియ మరో వారం రోజుల్లో ముగుస్తుందని, ఈ విషయంలో ఎన్‌సీబీసీ తన పూర్తిస్థాయి రికమెండేషన్‌ను కేంద్రానికి వెల్లడించడం జరుగుతుందన్నారు. సామాజిక సాధికరత, సామాజిక న్యాయం చేయడంలో రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీతోపాటు అన్ని పార్టీలకు చెందిన ఆయా కులాల నాయకులు సహకరించారని సంతోషం వ్యక్తంచేశారు. కేంద్రం ఓబీసీ జాబితాలో ఈ ఐదు కులస్తుల పేర్లను చేర్చడంపై కేంద్ర ప్రభుత్వానికి జీవీఎల్ కృతజ్ఞతలు తెలిపారు.

కళింగవైశ్య సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు కోణార్క్ శ్రీను మాట్లాడుతు ఓబీసీ జాబితాలో ఐదు కులాలను చేర్చే ప్రక్రియలో కీలకభూమిక వహించిన ఎంపీ జీవీఎల్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో కళింగ వైశ్యలను బీసీ–డీలో చేర్చిన సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వివిధ కుల సంఘాల జాతీయ, రాష్ట్ర ప్రతినిధులు ఎస్.కోటేశ్వరరావు, ఎస్.కోటేశ్వర చౌదరి, పోలుమహంతి ఉమామహేశ్వరరావు, కద్దాల శ్యామ్‌సుందరరావు, ఊన్న నాగరాజు, కొరాడ రమేష్, బీజేపీ జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, ఎంబీజీ నాయకుడు తదితరులు పాల్గొన్నారు.

ఐదున్నర కిలోల గంజాయి పట్టివేత

ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం రూరల్: ఒడిశా నుంచి అక్రమంగా ఐదున్నర కిలోల గంజాయిని తరలిస్తున్న లారీని ఎస్‌ఈబీ సిబ్బంది పట్టుకున్నారు. ఎస్‌ఈబీ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. టీఎన్ 52 ఎల్ 7662 నంబర్ గల లారీలో అనుగుల్ నుంచి కోయంబత్తూర్‌కు ఐరన్ ఓర్ లోడ్‌తో తమిళనాడుకి చెందిన డ్రైవర్ ఆరోగ్యదాస్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఒడిశాలోని గిరిసోల వద్ద 5 కేజీల 450 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి లారీ ద్వారా తరలిస్తున్నాడు. ఈ లారీని లొద్దపుట్టి వద్ద గురువారం ఎస్‌ఈబీ సిబ్బంది, ప్రత్యేక బృందం వారు తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. లారీని సీజ్‌చేసి గంజాయిని స్వాధీనం చేసుకొని, డ్రైవర్ ఆరోగ్యదాస్‌ని అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ ఎస్‌ఐ గురుమూర్తి సిబ్బంది తెలిపారు.

స్కూటీ, బైక్ ఢీ: వీఆర్‌ఓకు తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీఆర్‌ఓ మౌనిక

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళంలోని డేఅండ్‌నైట్ జంక్షన్ సమీపంలోని విజయ గణపతి ఆలయం వద్ద గురువారం స్కూటీ బైక్‌ను ఢీకొన్న ఘటనలో బొడిగి మౌనిక అనే వీఆర్‌ఓ తీవ్రంగా గాయపడ్డారు. ట్రాఫిక్ ఎస్ఐ ఎస్ఎస్ దొర చెప్పిన వివరాల మేరకు.. ఎచ్చెర్ల మండలం కొత్తపేట గ్రామానికి చెందిన బొడిగి గోవిందరావు, ఉమాదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె మౌనిక నాలుగేళ్లగా శ్రీకాకుళంలోని రైతు బజారు సచివాలయంలో వీఆర్‌ఓగా పనిచేస్తున్నారు. ఆమె గురువారం మధ్యాహ్నం తహసీల్దారు కార్యాలయానికి వెళ్లేందుకు పాలకొండ రోడ్డులో వెళ్తుండగా.. డేఅండ్‌నైట్ జంక్షన్ నుంచి ఏడురోడ్ల కూడలి వైపు వెళ్తున్న యువకుడు తర్రా కూర్మారావు తన ఎఫ్‌జెడ్ బైక్‌తో వేగంగా వచ్చి మౌనిక స్కూటీని ఢీకొట్టాడు. దీంతో ఇద్దరూ కింద పడిపోయారు. మౌనిక తలకు గాయమైంది. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ వెంకటరావు, ఉప తహసీల్దార్ రాజు, సహచర వీఆర్వోలు రిమ్స్‌కు వెళ్లి చూశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మౌనికను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన యువకుడు కూర్మారావుది కోటబొమ్మాళి మండలం సుబ్బారావుపేట గ్రామం. పోలీసులు దీనిపై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో కాంపౌండర్ దుర్మరణం



నెయ్యిల రమేష్ (ఫైల్)

పలాస జాతీయ రహదారిపై విగతజీవిగా నెయ్యిల రమేష్

కాశీబుగ్గ: పలాస మండలం రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలోని కోసంగిపురం కూడలి జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో మందస మండలం మధ్యదేవుపురం గ్రామానికి చెందిన నెయ్యిల రమేష్(42) మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. నెయ్యిల రమేష్ కాశీబుగ్గలోని శ్రీరాజేశ్వరి నర్సింగ్ ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం స్వగ్రామం నుంచి కాశీబుగ్గ ఆస్పత్రికి బైక్‌పై వెళ్తుండగా హైవేపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, నేషనల్ హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

మృతుడికి భార్య నీలవేణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పటి వరకు ఇంటిలోనే ఉండి బయల్దేరిన కాసేపటికే చావు వార్త వినిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ సంఘటనతో దేవుపురం గ్రామంలో విషాద ఛాయలు చోటుచేసుకున్నాయి. కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ గణపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.